28102024-MAI-12_Layout 1 10/28/2024 2:44 AM Page 1

కివీస్ జయభేరి

సారథి సోఫీ డివిన్ ఆల్‌రౌండ్ షో • సిరీస్‌ను సమం చేసిన న్యూజిలాండ్ • రాధా యాదవ్ పోరాటం వృథా • భారత బ్యాటింగ్ వైఫల్యం

అహ్మదాబాద్: భారత పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ మహిళల జట్టు తొలి వన్డేలో ఓడినా రెండో వన్డేలో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో కివీస్ 76 పరుగుల తేడాతో టీమ్‌ఇండియాను ఓడించింది. ఆ జట్టు సారథి సోఫీ డివిన్ బ్యాట్‌తో (86 బంతుల్లో 79, 7 ఫోర్లు, 1 సిక్సర్) పాటు బంతితో (3/27)నూ సత్తా చాటి కివీస్ విజయంలో కీలకపాత్ర పోషించింది. సూజీ బేట్స్ (58) రాణించింది. ఛేదనలో టాపార్డర్, మిడిలార్డర్ చేతులెత్తేయడంతో భారత్ 47.1 ఓవర్లలో 183 పరుగులకే ఆలౌట్ అయింది. మొదట బంతితో (4/69) కివీస్‌ను కట్టడి చేయడమే గాక మూడు అద్భుతమైన క్యాచ్‌లు పట్టిన యువ స్పిన్ ఆల్‌రౌండ్ రాధా యాదవ్.. బ్యాట్‌తోనూ (64 బంతుల్లో 48, 5 ఫోర్లు) పోరాడింది. పదో నెంబర్ బ్యాటర్ సైమా ఠాకూర్ (29)తో కలిసి పోరాడి భారత ఓటమి అంతరాన్ని తగ్గించింది. డివిన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరుజట్ల మధ్య సిరీస్ విజేతను నిర్ణయించే మూడో వన్డే ఈనెల 29న ఇదే వేదికపై జరుగనుంది.

రాణించిన సూజీ, డివిన్

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్‌కు ఓపెనర్లు శుభారంభాన్ని అందించారు. బేట్స్‌తో పాటు జార్జియా ప్లిమ్మర్ (41) తొలి వికెట్‌కు 87 పరుగులు జోడించారు. ఓవర్‌కు 6 రన్ రేట్‌కు తగ్గకుండా ఆడటంతో కివీస్ స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. దీప్తి శర్మ కివీస్‌ను తొలి దెబ్బ కొట్టింది. ప్లిమ్మర్‌ను 16వ ఓవర్లో ఔట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీసింది. వన్‌డౌన్‌లో వచ్చిన లారెన్ (3) రనౌట్ కాగా అర్ధసెంచరీ తర్వాత బేట్స్‌ను రాధా యాదవ్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు పంపింది. బ్రూక్ (8) సైతం నిష్క్రమించడంతో ఆ జట్టు స్కోరు వేగం మందగించింది. ఈ క్రమంలో కెప్టెన్ డివిన్, మ్యాడీ గ్రీన్ (42) కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 82 వికెట్లు జతకూర్చడంతో పర్యాటక జట్టు భారత్ ఎదుట పోరాడే స్కోరును నిలపగలిగింది.

బ్రూక్ హ్యాలిడే ఇచ్చిన క్యాచ్‌ను ముందుకు డైవ్ చేస్తూ అద్భుతంగా అందుకుంటున్న రాధ

టాపార్డర్ వైఫల్యం

లక్ష్య ఛేదనలో భారత్ ఆది నుంచే తడబడింది. టాపార్డర్ బ్యాటర్లలో స్మృతి మంధాన ఎదుర్కున్న రెండో బంతికే ప్లిమ్మర్‌కు క్యాచ్ ఇచ్చి డకౌట్ కాగా షఫాలీ వర్మ (11)ను కెర్ వికెట్ల ముందు బలిగొంది. యస్తికా భాటియా (12), జెమీమా రోడ్రిగ్స్ (17) సైతం విఫలమవగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24) కూడా అనవసర షాట్ ఆడి వికెట్ సమర్పించుకుంది. తేజల్ (15), దీప్తి (15) నిరాశపరిచారు.

రాధా, సైమా పోరాటం

108 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన రాధా, సైమా ఠాకూర్ భారత్‌ను ఆదుకున్నారు. ఈ ఇద్దరి పోరాటంతోనే ఆతిథ్య జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. కివీస్ బౌలర్లను ఈ ఇద్దరూ 17 ఓవర్ల పాటు సమర్థవంతంగా అడ్డుకోగలిగారు. గెలుపు మీద ఆశలు లేకున్నా ఈ ద్వయం ఏదైనా అద్భుతం చేయకపోతుందా? అని చూసిన భారత అభిమానుల ఆశలపై కెర్ నీళ్లు చల్లింది. ఆమె వేసిన 44వ ఓవర్లో ఆఖరి బంతిని షాట్ ఆడబోయిన సైమా.. బేట్స్ చేతికి చిక్కడంతో 70 పరుగుల 9వ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. డివిన్ 48వ ఓవర్లో రాధాను ఔట్ చేసి భారత ఇన్నింగ్స్‌ను ముగించింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 50 ఓవర్లలో 259/9 (డివిన్ 79, బేట్స్ 58, రాధా 4/69, దీప్తి 2/30); **భారత్:** 47.1 ఓవర్లలో 183 ఆలౌట్ (రాధా 48, సైమా 29, డివిన్ 3/27, తహుహు 3/42)

తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా హైకోర్టులో ప్రముఖ న్యాయవాది టి. రాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన ఎన్నికలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా ఎల్.బి. లక్ష్మీకాంత్ రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా పి. అరవింద్ కుమార్, కోశాధికారిగా కంచర్ల సత్యప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఎస్. విజయ్ కుమార్ రెడ్డి ఎన్నికైనట్టు ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు టి.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్చరీకి పూర్వవైభవాన్ని తీసుకొస్తామని, ఆర్చర్ల నైపుణ్యతను పెంచే కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తామని తెలిపారు.

హైదరాబాద్ భారీ స్కోరు

హైదరాబాద్: ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (173) భారీ శతకానికి తోడు రోహిత్ (84), అభిరత్ (68), హిమతేజ (60), తనయ్ (53) అర్ధ శతకాలతో మెరవడంతో ఉప్పల్ వేదికగా పుదుచ్చేరితో జరుగుతున్న రంజీ ఎలైట్ గ్రూప్ గ్రూప్-బీ మూడో మ్యాచ్ లో హైదరాబాద్ భారీ స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 536/8 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన పుదుచ్చేరి.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 24 పరుగులు చేసింది.

గంభీర్ నేర్చుకుంటాడు: రవిశాస్త్రి

పూణె: స్వదేశంలో 12 ఏండ్ల తర్వాత భారత క్రికెట్ జట్టు టెస్టు సిరీస్ కోల్పోయిన నేపథ్యంలో కోచ్ గౌతం గంభీర్‌పై విమర్శకులు విమర్శల వర్షం కురిపిస్తున్న నేపథ్యంలో టీమ్‌ఇండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అతడికి అండగా నిలిచాడు. పూణె టెస్టులో ఓటమి తర్వాత శాస్త్రి మాట్లాడుతూ.. 'న్యూజిలాండ్‌కు ఇది అత్యంత మధురమైన విజయం. గంభీర్ కొద్దిరోజుల క్రితమే హెడ్‌కోచ్ బాధ్యతలను చేపట్టాడు. అత్యంత క్రేజ్ కలిగిన భారత క్రికెట్ జట్టుకు కోచ్‌గా ఉండటం అంటే సాధారణ విషయం కాదు. కోచ్‌గా అతడికి ఇది ఆరంభ దశ. త్వరలో అతడు నేర్చుకుంటాడు' అని వ్యాఖ్యానించాడు.

షమీ లేకపోవడం లోటే.. కానీ!

సిడ్నీ: త్వరలోనే ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన సీనియర్ పేసర్ మహ్మద్ షమీ లేకపోవడం రోహిత్ సేనకు పెద్ద ఎదురుదెబ్బ అని ఆసీస్ హెడ్‌కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు. అయితే షమీ లేకపోయినా రిజర్వ్ పేసర్లు సైతం ఆసీస్‌లో సంచలనాలు సృష్టించగలరని తమకు తెలుసునని ఆ మేరకు తాము సిద్ధమయ్యామని తెలిపాడు. ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డొనాల్డ్ మాట్లాడుతూ.. 'ఆసీస్‌కు రాబోయే భారత జట్టులో షమీ లేకపోవడం భారీ లోటు. గత సిరీస్‌లలో అతడు తన పేస్, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో మా బ్యాటర్లను ఎన్నో ఇబ్బందులకు గురిచేశాడు. షమీ లేకపోవడం మాకు కలిసొచ్చేదే కానీ అతడు లేకపోయినా బుమ్రా నేతృత్వంలోని భారత పేస్ దళం అద్భుతాలు చేయగలదని మాకు తెలుసు. గత సిరీస్‌లో రిజర్వ్ బౌలర్లతో బరిలోకి దిగినా భారత్ మెరుగైన ఫలితాలు సాధించింది. వారిని తక్కువగా అంచనా వేయబోం' అని చెప్పాడు. నవంబర్ 22 నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి తెరలేవనుంది.

పాక్ సారథిగా రిజ్వాన్

సెంట్రల్ కాంటాక్టులలో షహీన్ అఫ్రిదికి డిమోషన్

లాహోర్: పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కొత్త సారథి వచ్చాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆ బాధ్యతలను వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌కు అప్పజెప్పింది. సుమారు ఏడాదిన్నర కాలంగా ఫామ్‌లేమితో బాధపడుతూ జట్టును విజయవంతంగా నడపలేక పోతున్న మాజీ సారథి బాబర్ ఆజమ్ కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పగా ఆ స్థానాన్ని రిజ్వాన్ భర్తీ చేయనున్నాడు. త్వరలో పాక్.. ఆస్ట్రేలియా, జింబాబ్వే పర్యటనలకు వెళ్లనున్న నేపథ్యంలో పీసీబీ కొత్త సారథి పేరును ఖరారుచేయడం గమనార్హం. ఇక ఆదివారం పీసీబీ ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్టుల జాబితాలో స్టార్ పేసర్ షహీన్ షా అఫ్రిది 'ఏ' కేటగిరీ నుంచి 'బీ'కి పడిపోయాడు. టెస్టు సారథి షాన్ మసూద్.. 'డీ' నుంచి 'బీ'కు ప్రమోట్ అయ్యాడు. బాబర్, రిజ్వాన్ 'ఏ' కేటగిరీలో తమ కాంట్రాక్టులను నిలుపుకున్నారు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు బాబర్‌ను పక్కనబెట్టడంపై వ్యాఖ్యానించిన ఫకర్ జమాన్ సెంట్రల్ కాంట్రాక్టును కోల్పోయాడు.

పారా షట్లర్ల పతకాల పంట

టోక్యో (జపాన్): కొద్దిరోజుల క్రితమే పారిస్ వేదికగా ముగిసిన పారాలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో పతకాలు సాధించిన భారత పారా షట్లర్లు జపాన్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ టోర్నీలోనూ సత్తా చాటారు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో భారత్ ఏకంగా 24 పతకాలు సాధించింది. మన పారా షట్లర్లకు 6 స్వర్ణాలు, 9 రజతాలు, 9 కాంస్యాలు దక్కాయి. ఎస్‌హెచ్6 (సింగిల్స్, డబుల్స్) కేటగిరీలో శివరాజన్ సొలైమలై రెండు స్వర్ణాలు కొల్లగొట్టాడు. ఎస్‌హెచ్6 ఫైనల్‌లో శివరాజన్.. 21-16, 21-16తో వోంగ్ (వియత్నాం)ను చిత్తుచేశాడు. మరో షట్లర్ సుకంత్ కదం సైతం పురుషుల సింగిల్స్ (ఎస్ఎల్ 4)లో పసిడి నెగ్గగా ఎస్ఎల్ 3, 4 డబుల్స్ ఈవెంట్స్‌లో దినేశ్ రాజయ్యతో కలిసి రజతం సాధించాడు. పారాలింపిక్స్ చాంపియన్ కుమార్ నితేశ్ ఎస్ఎల్ 3 ఫైనల్స్‌లో ఓడి రజతంతో సరిపెట్టుకున్నాడు. మహిళల విభాగంలో మనీషా రామదాస్ బంగారు పతకం (ఎస్‌యూ5) సాధించింది.

స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు సెలక్షన్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఈ ఏడాది డిసెంబర్‌లో కోయంబత్తూరు, బెంగళూరు వేదికలుగా జరుగబోయే 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ కోసం హైదరాబాద్‌లో నిర్వహించిన సెలక్షన్స్‌లో రాష్ట్రంలోని బాలబాలికలు సత్తా చాటారు. నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ కమ్ సెలక్షన్ పోటీలు జరిగాయి. రోలర్ ఫ్రీస్టయిల్ బాలికల విభాగంలో రాధె లోయతో పాటు సుహాని, నిషిత, జాన్వి, మోక్షిత్ రామ్, అన్స్ అసవ ఎంపికయ్యారు. స్కేట్ బోర్డింగ్ ఈవెంట్‌లో సాన్వి, షౌని, దియా, రోహిత్, హర్షిత్.. ఇన్‌లైన్ ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో శ్రీయ, సాయి సనీష్, యశస్విని, దీషిక, అరవ్ చోటు దక్కించుకున్నారు.

జాతీయ యోగాలో తెలంగాణకు స్వర్ణం

కొత్తపల్లి/మానకొండూర్, అక్టోబర్ 27: జాతీయస్థాయి యోగా పోటీల్లో తెలంగాణకు తొలిసారిగా స్వర్ణ పతకం లభించింది. ఈనెల 24-27 మధ్య హిమాచల్‌ప్రదేశ్‌లోని ఉనాలో జరిగిన పోటీల సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర జట్టు తరపున పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లికి చెందిన దీపక్ పసిడి పతకంతో మెరిశాడు. దీపక్ మానకొండూరులోని సాంఘీక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.

ముగిసిన మనిక పోరాటం

మాంటెపెలియర్ (ఫ్రాన్స్): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ టోర్నీలో భారత స్టార్ ప్యాడ్లర్ మనిక బత్రా పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో మనిక.. 8-11, 8-11, 10-12తో క్వియాన్ టియాన్యి (చైనా) చేతిలో అపజయం పాలైంది. 25 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో టియాన్యి జోరు ముందు మనికా నిలవలేకపోయింది. ఈ టోర్నీలో క్వార్టర్స్ చేరిన తొలి భారత ప్యాడ్లర్‌గా రికార్డు లకెక్కిన ఆమె.. ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ బెర్నాడట్టె (రొమానియా)ను ఓడించినా కీలక మ్యాచ్‌లో ఓడింది.

సంక్రాంతి సంబరానికి సిద్ధం

అగ్ర కథానాయకుడు వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ గ్రిప్పింగ్ ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ 90శాతం పూర్తయింది. తాజాగా చిత్రబృందం డబ్బింగ్ కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియో నుంచి ఓ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ వీడియో వేడుకను తలపించింది. వెంకటేశ్, అతని భార్య పాత్ర పోషిస్తున్న ఐశ్వర్యరాజేశ్, వారి కుటుంబం అంతా ఉత్సాహంగా కనిపించారు. వెంకీ చరిష్మా, అనిల్ రావిపూడి హ్యూమర్.. ఆడియన్స్‌కి ఓ గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వనున్నాయని మేకర్స్ చెబుతున్నారు. ఇందులో వెంకీ ప్రియురాలిగా మీనాక్షి చౌదరి కనిపించనుంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రంలో ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేశ్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాత: శిరీష్, సమర్పణ: దిల్‌రాజు.

దేశాన్నీ, బంధాన్నీ ప్రేమించే కుటుంబకథ

'మేజర్ ముకుంద్ వరదరాజన్, ఇందు రెబెకాల ట్రూ స్టోరీ ఇది. దేశాన్నీ, బంధాన్నీ ప్రేమించే కుటుంబం ఎలా ఉంటుందో దర్శకుడు రాజ్‌కుమార్ అద్భుతంగా చూపించారు. ఇందులో మేజర్ ముకుంద్‌గా నేను, ఇందుగా సాయిపల్లవి కనిపిస్తాం. యాక్షన్‌తోపాటు ప్రేమ కూడా ఇందులో బలంగా ఉంటుంది. కమల్‌హాసన్‌గారు ఈ సినిమా నిర్మాత కావడంతో ఆటోమేటిగ్గా సినిమాకు హైప్ పెరిగింది. అందరికీ నచ్చుతుందని నమ్మకంతో ఉన్నాం' అని శివకార్తికేయన్ అన్నారు. ఆయనా, సాయిపల్లవి జంటగా నటించిన బయోగ్రాఫికల్ యాక్షన్ మూవీ 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకుడు. సోనీపిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్టైన్మెంట్‌తో కలిసి కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో శివకార్తికేయన్ మాట్లాడారు. అతిథిగా విచ్చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్ చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. సాయిపల్లవి మాట్లాడుతూ ' 'అమరన్' సినిమాతో మీ ముందుకొస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇది రియల్ సోల్జర్ జర్నీ. నా పాత్రను దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్న సుధాకర్‌రెడ్డి, నిఖిత రెడ్డి గార్లకు థ్యాంక్స్.' అని చెప్పారు. ఇంకా దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి, గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి కూడా మాట్లాడారు.

రణమండల హనుమాన్

ప్రతిష్టాత్మక పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై 'రణమండల' అనే భారీ డివోషనల్ ఎంటర్టైనర్ తెరకెక్కనుంది. ఆంజనేయుని నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో వీఎఫ్ఎక్స్, యాక్షన్, ఎమోషనల్ సన్నివేశాలు కీలకంగా ఉండనున్నాయి. ఆదోని రణమండల దేవాలయంలో ఆంజనేయుని సన్నిధిలో, వేద పండితుల ఆశీర్వచనాలతో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రం టైటిల్‌ని ప్రకటించారు. రణమండల ఆంజనేయుని క్షేత్ర నామాన్నే ఈ సినిమా టైటిల్‌గా పెట్టడం విశేషం. 'పూర్తిగా ఆదోని పరిసరాల్లోనే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ జరుగుతుంది. ఇది మా సంస్థ నుంచి వస్తున్న 46వ చిత్రం. దర్శకుడు, నటీనటులు, సాంకేతికనిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తాం.' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు.

చిత్రం

నాపై నాకే అసహ్యం వేసింది

దక్షిణాదికి చెందిన ఓ నిర్మాత విద్యాబాలన్‌ని ఘోరంగా అవమానించాడట. తను అన్న మాటలకు దాదాపు ఆరు నెలలు అద్దంలో ముఖం చూసుకోలేకపోయిందట విద్యాబాలన్. కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఆ చేదు అనుభవాన్ని తన తాజా ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నది విద్యాబాలన్. 'హీరోయిన్‌గా ఫస్ట్ నేను బుక్ అయిన సినిమా మలయాళ చిత్రం 'చక్రం'. మోహన్‌లాల్ హీరో అనగానే నాకు ఆనందం ఆగలేదు. స్టార్ హీరో సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నానని తెలియగానే, అవకాశాలు పోటెత్తాయి. వరుసగా సినిమాలకు సంతకాలు చేశాను. ఉన్నట్టుండి 'చక్రం' మధ్యలోనే ఆగిపోయింది. ఆ విషయం తెలిసి, నా జాతకం మంచిది కాదని మిగతా సినిమాల నుంచి కూడా నన్ను తొలగించేశారు. మానసికంగా క్రుంగిపోయా. ఇంట్లో మనశ్శాంతి లోపించింది. ప్రతి రోజూ గొడవలే. కొంతకాలానికి తమిళంలో ఆఫర్ వచ్చింది. కొన్ని రోజులు షూట్ చేశా. ఆ చిత్ర నిర్మాతకు 'చక్రం' ఆగిపోయిన విషయం తెలిసింది. వెంటనే నా జాతకం చూపించాడు. తన సినిమాకు నేను సెట్ కానని నన్ను తొలగించేశాడు. ఈ విషయం తెలిసి అమ్మానాన్నల్ని వెంటపెట్టుకొని సదరు నిర్మాతను కలిశా. అతను అప్పటివరకూ నాతో తీసిన సన్నివేశాలను చూపిస్తూ.. 'చూడండి.. ఆ ముఖంలో హీరోయిన్ కళ కొంచెమైనా ఉందా?.. డాన్స్ రాదు.. యాక్టింగ్ రాదు.. ఎందుకు మాకీ తలనొప్పి..' అనేశాడు. ఆ దెబ్బతో దాదాపు ఆర్నెల్లు అద్దంలో నా ముఖాన్ని నేను చూసుకోలేదు. నాపై నాకే అసహ్యం వేసింది. ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయా. ఆ టైమ్‌లో ప్రదీప్ సర్కార్ నాకు అండగా నిలిచి, యాడ్ ఫిల్మ్స్‌లో అవకాశాలిప్పించారు. నా జీవితంలో మరిచిపోలేని రోజులవి.' అంటూ చెప్పుకొచ్చింది విద్యాబాలన్.

ఓ సగటు మనిషి జీవితం లక్కీభాస్కర్

''లక్కీ భాస్కర్' ఓ కొత్త ప్రయత్నం. వెంకీ చూడ్డానికి చిన్నాకుర్రాడిలా ఉంటాడు. కానీ తను రాసిన సన్నివేశాలు హృదయాలను తాకుతాయి. మీనాక్షి చౌదరి అద్భుతమైన పాత్ర చేసింది. తనతో నటించిన సన్నివేశాలు ఇంకా మనసులో మెదులుతూనే ఉన్నాయి. ఇదొక సగటు మనిషి జీవితం. అందరికీ నచ్చుతుంది' అని దుల్కర్ సల్మాన్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం లక్కీభాస్కర్. మీనాక్షి చౌదరి కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ జరిగింది. అతిథుల్లో ఒకరైన దేవరకొండ విజయ్ మాట్లాడుతూ 'యాక్టర్ అవ్వకముందు దుల్కర్ సినిమాలు చూస్తూ ఉండేవాడ్ని. దుల్కర్‌తో మహానటి, కల్కి సినిమాలు చేశా. కానీ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోలేదు. త్వరలో ఆ కోరిక తీరుతుందనుకుంటున్నా. 'లక్కీభాస్కర్' పెద్ద హిట్ అవ్వాలి' అని ఆకాంక్షించారు. మరో అతిథి త్రివిక్రమ్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాను. వెంకీ ఈ కథను డిజైన్ చేసిన తీరు వండర్. ఇందులోని ప్రతి పాత్రా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. ఇక దుల్కర్ వేరే లెవల్. ఇప్పటివరకూ చూసిన దుల్కర్ వేరు. ఇందులోని దుల్కర్ వేరు.' అన్నారు. ఇంకా దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, రాంకీ, మానసా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశభక్తి నేపథ్యంలో ఫౌజా

కార్తీక్ దమ్ము, ఐశ్వర్యాసింగ్, పవన్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'ఫౌజా'. ప్రమోద్‌కుమార్ పున్నా దర్శకుడు. అజిత్ దాల్మియా నిర్మాత. హిందీలో రూపొందిన ఈ చిత్రానికి మూడు జాతీయ అవార్డులు వరించాయి. హిందీ ప్రేక్షకులను కూడా ఈ చిత్రం ఆకట్టుకున్నది మేకర్స్ చెబుతున్నారు. త్వరలో తెలుగులో విడుదల కానున్న ఈ సినిమాను హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు కార్తీక్ దమ్ముతోపాటు హర్యానా ప్రిన్సిపల్ సెక్రటరీ డా.డి.సురేశ్, శ్రీమతి కాంతి డి.సురేశ్ అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. అన్ని ప్రాంతాల వారికీ నచ్చే కథ ఇదని హీరో కార్తీక్ చెప్పారు. దేశం అంటే ప్రేమ, భక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ 'ఫౌజా' నచ్చుతుందని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శశాంక్ విరాగ్, సంగీతం: యుగ్ భూషల్, నేపథ్య సంగీతం: సంకేత్ సానే.

ఈ ధోరణి ప్రమాదకరం

ఇటీవలి కాలంలో సోషల్‌మీడియాలో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి ఆగ్రహం వ్యక్తం చేసింది బాలీవుడ్ భామ అలియాభట్. అందం కోసం తాను ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకున్నదని, తను నవ్వే తీరు అస్సలు బాగోదని వీడియోల ద్వారా కొందరు చేస్తున్న దుష్ప్రచారంపై అలియా మండిపడింది. 'కొందరైతే నేను అనారోగ్యం బారిన పడ్డానని దారుణమైన ప్రచారానికి దిగారు' అని అలియా వాపోయింది. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టానుసారం ప్రచారం చేసేవారు జాగ్రత్తగా ఉండాలని ఆమె హెచ్చరించింది. ఇంకా మాట్లాడుతూ 'ఎలాంటి సాక్ష్యాలు లేకుండా పోస్టులు పెట్టడం చట్టప్రకారం నేరం. కేవలం వ్యూస్ కోసం ఇలాంటి చవకబారు పనులు చేస్తున్నారు. ఆ పోస్ట్‌లకు జుగుప్సాకరమైన కామెంట్స్ పెట్టేవాళ్లలో మహిళలు కూడా ఉండటం సిగ్గుచేటు. ఈ ధోరణి ఎప్పటికైనా ప్రమాదమే. ఈ విషయంలో ఇకపై సీరియస్‌గానే చర్యలు తీసుకోబోతున్నా.' అని హెచ్చరించింది. ఇటీవలే 'జిగ్రా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది అలియా. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాతో పాటు అలియా వ్యక్తిగత జీవితంపై కొందరు సోషల్‌మీడియాలో నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు.

మాలో హీరో పెయిర్ ఎవరో చెప్పం

కిరణ్ అబ్బవరం హీరోగా రూపొందిన పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. సుజీత్, సందీప్ కలిసి దర్శకత్వం వహించారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులోని కథానాయికలు నయన్‌సారిక, తన్వీ రామ్ ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. నయన్ సారిక మాట్లాడుతూ ' 'గం గం గణేశా'లో మోడ్రన్‌గా, 'ఆయ్'లో ట్రెడిషనల్‌గా కనిపించా. వాటికంటే భిన్నమైన పాత్ర 'క'లో చేశా. ఇందులో నా కేరక్టర్ పేరు సత్యభామ. ఇది 70'sలో జరిగే కథ. అందుకే.. సావిత్రిగారిని ప్రేరణ తీసుకొని చేశా. ఆమెలా నేనూ గ్లిజరిన్ లేకుండ